విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

చందానగర్ ఉపకమిషనర్ వంశీకృష్ణ

హఫీజ్‌పేట్: పారిశుధ్య కార్మికుల హాజరులో నిర్లక్ష్యం వహిస్తే తక్షణమే ఉద్యోగం నుంచి తొలగిస్తామని చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో ఎస్ఎఫ్ఏ, ఎస్ఆర్పీలతో ఎస్‌డబ్ల్యూఎం డీసీ వేణుగోపాల్‌రెడ్డి, డీసీ వంశీకృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికలో ఎలాంటి అవకతవకలు జరిగినా సంబంధిత ఎస్ఎఫ్ఏ, ఎస్ఆర్పిలదే బాధ్యత అని వెంటనే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. రోడ్లపై, ఖాళీ స్థలాలలో చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు కనబడితే చర్యలు తప్పవన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఖాళీ ప్రదేశాలలో చెత్త వేయకుండా బస్తీ, కాలనీలలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏఎంహెచ్ఓ డాక్టర్ కార్తీక్, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, 21 ఎస్ఎఫ్ఏలు, 6 ఎస్ఆర్పీలు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న డీసీ వంశీకృష్ణ, ఎస్‌డబ్ల్యూఎం డీసీ వేణుగోపాల్‌రెడ్డి

అక్రమ నిర్మాణాలను తొలగించాలి


జెడ్‌సికి వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు కమలాకర్‌రెడ్డి, కుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరుతూ జీహెచ్‌యంసీ ప్రజావాణిలో జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌కు సోమవారం బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి బీజేవైఎం నేషనల్ కోఆర్డినేటర్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో ఉన్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూముల్లో ప్రైవేట్ వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన జెడ్‌సి వీలైనంత త్వరగా రెవెన్యూ అధికారులతో మాట్లాడి సర్వే చేస్తామన్నారని తెలిపారు. అదే విధంగా మహంకాళి నగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, రోడ్డు, మంచినీటి సమస్యలు, చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు, దోమల సమస్య, హిందూ శ్మశానవాటిక వంటి సమస్యలను కూడా జెడ్‌సి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామరాజు, సీనియర్ నాయకులు కేశవరావు, అరుణ్ కుమార్, మణిభూషణ్, డివిజన్ నాయకులు రఘు, సంతోష్, ప్రకాష్, శ్రీనివాస్ రెడ్డి, మహిళా నాయకులు అనూష, జ్యోతి, మహంకాళినగర్, జయనగర్‌వాసులు పాల్గొన్నారు.

పెన్నార్ కార్మికులకు అండగా బీఆర్‌టీయూ

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పెన్నార్ పరిశ్రమ కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం అందించడంతోపాటు రాబోయే రోజుల్లో మరిన్ని హక్కులు సాధించేందుకు కృషి చేస్తున్న బీఆర్‌టీయూ యూనియన్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం రాత్రి పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన బీఆర్‌టీయూ (పెన్నార్ ఇండస్ట్రీస్) సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో గంట గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే.. అందరికీ ఆమోదయోగ్యమైన వేతన ఒప్పందం, హెల్త్ ఇన్సూరెన్స్ పరిమితిని ఐదు లక్షల వరకు పెంచడం, శాశ్వత ఉద్యోగ నియామకాలు, న్యాయబద్ధంగా యాజమాన్యం నుండి కార్మికులు రావాల్సిన బెనిఫిట్స్‌ను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు, యూనియన్ అధ్యక్షులు రాంబాబు యాదవ్, బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, గూడెం మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, పాండు, కార్మిక సంఘం ప్రతినిధులు, భారీ సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి


సిద్ధిఖీనగర్‌లో జగదీశ్వర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న కార్యకర్తలు

కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్

గచ్చిబౌలి: పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుడిలా పని చేయాలని పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ కార్యకర్తలు, నాయకులకు సూచించారు. కొండాపూర్ డివిజన్‌లోని సిద్ధిఖ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో పార్టీ పరిస్థితిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనకు నిదర్శనంగా కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని కాలనీ, బస్తీలలో పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై కార్యకర్తలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన పనులను ప్రజలకు వివరించాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నందు, గోపాల్‌గౌడ్, ఫాజిల్, గణేష్, రవియాదవ్, వినయ్‌రెడ్డి, గాల్‌రెడ్డి, వెంకటస్వామి, అప్పల్‌కుమార్ యాదవ్, యోగిరెడ్డి, యాదయ్యగౌడ్, రవికుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్

మనూ వీసీ ప్రొ.ఐనుల్‌హసన్

రాయదుర్గం: సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ అని మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో మొదటి అంతర్జాతీయ ఉర్దూ సైన్స్ కాన్ఫరెన్స్–2024 సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ అనే అంశంపై ప్రారంభ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు కృత్రిమ మేధస్సు కీలకపాత్ర పోషిస్తుందన్నారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ మానవ శరీరం ప్రతికూల పరిచయ వ్యవస్థగా అభివృద్ధి చెందుతోందన్నారు. హైదరాబాద్‌లోని బిట్స్‌పిలానీ సీనియర్ ప్రొఫెసర్ అహ్మద్ కమల్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీలో ఔషధాల తయారీ గురించి వివరించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ సల్మాన్ అహ్మద్‌ఖాన్, డాక్టర్‌సలావుద్దీన్ సయ్యద్, డాక్టర్ మాజిద్ అలీ చౌదరి ప్రసంగించారు. ఈ సందర్భంగా సదస్సులో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు 150 సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు.


సదస్సులో పాల్గొన్న వీసీ ఐనుల్‌హసన్, హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు, ప్రొఫెసర్లు

ఫుడ్ ఫెస్టివల్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డిపార్టుమెంట్ ఆఫ్ లాంగ్వేజెస్ ఆధ్వర్యంలో సోమవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. భవాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో వ్యాపార మెళకువలు పెంపొందించడానికి ఉపయోగపడుతుందన్నారు. తినుబండారాల రంగంలో అపారమైన అవకాశాలున్నాయని ఆసక్తి గల విద్యార్థులు ఈ రంగాన్ని ఎంచుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన హైదరాబాద్ బిర్యాని, మిర్చి బజ్జీ, సర్వపిండి, పచ్చిపులుసు, జొన్న రొట్టెలు, రాగి సంకటి, నాటుకోడి పులుసు, సకినాలు, గుత్తి వంకాయ తదితర పదార్థాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ డా. రమేష్ బాబు, జీవశాస్త్రాల విభాగాధిపతి డా. పి. సురేష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చెత్త డంపింగ్.. చెరువు కలుషితం

• పరిసర ప్రాంతాలు దుర్గంధపూరితం • వాపోతున్న స్థానికులు

- కాయిదమ్మ కుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో చెత్త నిల్వలు
- పట్టించుకోని జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులు

హఫీజ్‌పేట్: డంపింగ్ యార్డుకు తరలించాల్సిన చెత్తను కాయిదమ్మకుంట చెరువు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో డంపింగ్ చేస్తుండడం.. వ్యర్థాలను చెరువులో పోస్తుండడంతో కలుషితం అవుతోంది. దీనికి తోడు చెత్త నుంచి వెలువడుతున్న దుర్వాసన భరించలేకపోతున్నామని పరిసర ప్రాంత కాలనీల ప్రజలు వాపోతున్నారు. చందానగర్ సర్కిల్ 21 పరిధిలోని చెత్తను దీప్తిశ్రీనగర్‌లోని డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంది. ఐతే హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువు వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి ఆ చెత్తలో వచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి మిగిలిన చెత్తను చెరువులో పడేస్తున్నారు. ఈ డంపింగ్ యార్డు చెరువు బఫర్ జోన్‌లోకి వస్తుంది. దీనిపై ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డును తొలగించాలని కోరుతున్నారు.


కాయిదమ్మకుంట చెరువు పక్కన ఎఫ్‌టీఎల్ స్థలంలో చెత్త డంపింగ్

సమస్యలివే..

- చెరువు పక్కనే అక్రమంగా స్క్రాప్ గోదాం ఏర్పాటు
- వ్యర్థాలలో ప్లాస్టిక్‌ను వేరు చేసి చెరువు పక్కన పడేస్తున్నారు.
- హోటళ్ళు, ఆసుపత్రి నుంచి తీసుకు వస్తున్న వ్యర్థాలూ ఇక్కడే ..
- వ్యర్థాలను పశువులు మేయడంతో అనారోగ్యం పాలవుతున్నాయి.
- ఇక చెత్త డంపింగ్ పక్కనే అక్రమంగా బోరు వేసి నీటిని తోడేస్తున్నారు.
- అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





దుర్వాసన.. జ్వరాలు



కాయిదమ్మకుంట చెరువు ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్‌లో కొన్ని సంవత్సరాల నుంచి అక్రమంగా చెత్త డంపింగ్ చేస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు వేరు చేసి మిగిలిన చెత్తను చెరువులో వేయడంతో దుర్వాసన తట్టుకోలేకపోతున్నాం. రోగాలు వస్తున్నాయి. జీహెచ్ఎంసీ అధికారులు డంపింగ్ చేయకుండా చూడాలి.

– మహేష్, అంబేడ్కర్‌నగర్ కాలనీ

చెత్త డంపింగ్ గోదాంను తొలగిస్తాం..

కాయిదమ్మకుంట చెరువు సమీపంలో చెత్త డంపింగ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. అక్రమంగా ఏర్పాటు చేసిన స్క్రాప్ గోదాంను వెంటనే తొలగించాలని నోటీసులు ఇచ్చాం. త్వరలో మేమే తొలగిస్తాం. అదే విధంగా చెత్త ఆటోలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుకు వెళ్ళే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– డా.కార్తీక్, ఏఎంహెచ్ఓ, చందానగర్ సర్కిల్– 21

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యంతోనే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో చెత్త డంపింగ్ జరుగుతోంది. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. చెరువు చుట్టూ ఉన్న బస్తీలు, కాలనీలవాసులు ఇబ్బందులుపడుతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

–జితేందర్, సాయికాలనీ

ప్రజావాణి ..7 దరఖాస్తులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్నినిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 7 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. గృహజ్యోతి కోసం 5 దరఖాస్తులు రాగా, ప్రాపర్టీట్యాక్స్, ఇంజనీరింగ్ విభాగాలకు ఒక్కొక్క దరఖాస్తు వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏసీపీ మెహ్రా, ఏఎంహెచ్ఓ నగేష్ నాయక్, ఏఎంసీ నరేందర్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరీ, ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని 4,7వ బ్లాక్‌లో సోమవారం సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ పుష్పనగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొంతకాలంగా రోడ్డు సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే నిధులు మంజూరు చేయించామన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ అలీ బాబా, హాబీబ్, అబ్దుల్ గఫార్, మల్లికార్జున్‌లు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ల కెపాసిటీ పెంపు

భాగ్యనగర్‌కాలనీ: వేసవికాలం యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కూకట్‌పల్లిలోని సోమశిల సబ్‌స్టేషన్‌లో 8వ ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లను మార్చి 12.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసినట్టు విద్యుత్ అధికారులు సోమవారం తెలిపారు. ఎండాకాలం విద్యుత్ వినియోగం పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సిజిఎం ఇంజనీర్ సాయిబాబా, ఎస్ఈ డీఎస్ మోహన్, డీఈ ఆపరేషన్ కూకట్‌పల్లి డి. చక్రవర్తి, ఏఈఈ, కూకట్‌పల్లి బి. ప్రసాద్, భక్తవత్సల్ రెడ్డి, అశోక్, లోకల్ ఏఈ శరత్‌బాబు, చైతన్య, కరణ్ కుమార్, పాపిరెడ్డి నగర్ అధ్యక్షుడు చంద్రారెడ్డి, జనరల్ సెక్రటరి భగవంత్‌రెడ్డి, శరత్ రెడ్డి, పాండుగౌడ్, స్థానికులు పాల్గొన్నారు.

ఇంటి తాళం పగులగొట్టి..

పటాన్‌చెరు టౌన్: దశదినకర్మకు వెళ్లి వచ్చే సరికి ఇంట్లో దొంగలు పడి 7.5 తులాల బంగారం, 55 తులాల వెండిని ఎత్తుకెళ్లిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు భిక్షపతి యాదవ్, పోచమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. గోకుల్‌నగర్ నుంచి సోమవారం ఉదయం జిన్నారం మండలం వావిలాల గ్రామంలో దశదినకర్మకి వెళ్లారు. మధ్యాహ్నం 2:30 గంటలకు ఇంటికి వచ్చి చూసేలోగా తాళం పగలగొట్టి ఉంది. దీంతో భిక్షపతి ఇంట్లోకి వెళ్ళి చూడగా బీరువా తీసి ఉంది. 7.5 తులాల బంగారం, 55 తులాల వెండి చోరీ జరిగినట్లు గుర్తించారు.దీంతో డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చి, అనంతరం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దేశం గర్వించేలా యువత తయారవ్వాలి


మాట్లాడుతున్న రత్నాకర్

సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్

గచ్చిబౌలి: దేశం గర్వించేలా యువత తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో సత్యసాయి సేవా సంస్థ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రత్నాకర్ మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న ప్రేమ, దయ గుణాలు ప్రపంచంలో ఎక్కడా కనిపించవన్నారు. సత్యసాయి బాబా బోధించిన విధంగా మన జీవితాలకు మనమే బాధ్యులమని గ్రహించి ముందుకు సాగాలన్నారు. అభివృద్ధిలో దూసుకుపోతున్నా దేశంలో వృద్ధాశ్రమాలు పెరిగిపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ప్రపంచానికి మనల్ని పరిచయం చేసిన తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని వారిని విస్మరించరాదన్నారు. గ్రామసేవే రామ్‌సేవ అని సమాజసేవ కార్యక్రమంలో పాల్గొంటూ దేశ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎం యూఎస్ ఇండియా సీనియర్ డైరెక్టర్ రమేష్ కున్నట్, సలహాదారులు యూఎస్ కాన్సులేట్ అనిత లహరి, సత్యసాయి సేవా సంస్థ తెలంగాణ శాఖ అధ్యక్షుడు వెంకట్‌రావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మల్లేశ్వరరావు 60 కళాశాలలకు చెందిన 6వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

నాలా కల్వర్టు పనులు పరిశీలన

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని కైలాష్‌నగర్ వద్ద జరుగుతున్న నాలా కల్వర్టు పనులను స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు రూ.1.60 లక్షలతో కల్వర్టు పనులు చేపడుతున్నామన్నారు. అమీన్‌పూర్‌కు వెళ్లాలంటే ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కల్వర్టు పూర్తయితే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ సంతోష్, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


సమావేశంలో పాల్గొన్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు

మాదాపూర్: అభివృద్ధే తన లక్ష్యమని చేవేళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని ఆవాస హోటల్‌లో సోమవారం శేరిలింగంపల్లి కమ్యూనిటీకి చెందిన రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గేటెడ్ కమ్యూనిటీలకు దగ్గరగా కమ్యూనిటీ పాఠశాలలు, క్లీనర్ లేక్స్, మెరుగైన వాకింగ్ ట్రాక్‌లు, విద్యుత్, నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ కాలనీల, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో.. 99 శాతం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల పరిధిలో బస్తీలు, కాలనీల్లో రెండవ రోజు పల్స్ పోలియో కార్యక్రమం సోమవారం కొనసాగింది. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్ళి పోలియో చుక్కలు వేసినట్లు శేరిలింగంపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చందర్ తెలిపారు. రెండవ రోజు 2,058 మంది చిన్నారులకు వేయడంతో 99 శాతం పూర్తయినట్టు తెలిపారు. నల్లగండ్ల అపర్ణ గ్రాండే సముదాయంలో వైద్య సిబ్బంది శోభారాణి, యాదమ్మలు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో మూర్తి, మోహన్‌రావు, బీఎస్ నాయుడు, సాంబశివరావు, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.


అపర్ణ గ్రాండేలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

కలెక్టర్‌కు వినతి

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని తాబేలుగుట్టపై నిర్మిస్తున్న జ్యోతిర్లింగ శివాలయానికి ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని జిన్నారం నాయకులు, శివ భక్తులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివాలయం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు భోజిరెడ్డి, నర్సింహ్మారెడ్డి, రాజిరెడ్డి, పుట్టి భాస్కర్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



హఫీజ్‌పేట్: కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన సాధ్యమని పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని రామకృష్ణనగర్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు విష్ణురెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. సుమారు 50 మందికి జగదీశ్వర్‌గౌడ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సాంబశివరావు, శ్రీనివాస్, రాంబాబు, నాగేశ్వరరావు, వీరభద్రరావు, విష్ణు, ఆనంద్‌రావు, కెన్నడీ, రామసుబ్బారెడ్డి, ప్రకాష్, వెంకట్రామిరెడ్డి, ఉపేందర్, నారాయణ, చంద్రమోహన్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పారిశుద్ధ్యం అమల్లో నిర్లక్ష్యం వద్దని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని సిబ్బందితో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తు పారిశుద్ధ్యం అమలును పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వారి పరిసరాలను శుభ్రం ఉంచుకోవాలని ఆయన కోరారు.


పార్కును శుభ్రం చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి

సీఎస్ఆర్ నిధులతో చెరువుల అభివృద్ధి

రాయదుర్గం: కార్పొరేట్ కంపెనీల సహకారంతో సీఎస్ఆర్ నిధులతో చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు జీహెచ్ఎంసీ లేక్స్ అధికారులు పేర్కొన్నారు. ముందుకొచ్చిన కంపెనీలతో ప్రత్యేక డిజైన్లు రూపొందించి వాటిని ఆమోదించాక చెరువు, కుంట సరిహద్దులను గుర్తించి ఫెన్సింగ్ వేయడం, ఎఫ్‌టీఎల్‌ను కాపాడడం, బ్యూటిఫికేషన్‌తో చెరువు చుట్టూరా వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయడం, ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లను మెరుగుపర్చడం, చెరువులను శుభ్రపర్చడం, డీసిల్టింగ్ మొదలైనవి చేపడతామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

గంజాయి సీజ్

ఒకరి అరెస్ట్...కేసు నమోదు

హఫీజ్‌పేట్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని చందానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. శేరిలింగంపల్లి చందానగర్ పాపిరెడ్డి కాలనీకి చెందిన ఆవు రాజేష్ (23) కూలీ. ఏపీ రాష్ట్రం అరకు నుంచి గంజాయి తెచ్చి పాపిరెడ్డి కాలనీలో విక్రయిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారంతో చందానగర్ పోలీసులు పాపిరెడ్డి కాలనీకి రాగా పోలీసులను గమనించిన రాజేష్ పారిపోవడానికి ప్రయత్నించగా వెంటనే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని బ్యాగును పరిశీలించారు. 745 గ్రాముల గంజాయి లభించింది. సుమారు దాని విలువ రూ.20వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతన్ని రిమాండ్‌కు తరలించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మియాపూర్: ప్రజా సమస్యలను స్టాండింగ్ కమిటీలో ప్రస్తావించి సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను సోమవారం మయూరినగర్ కాలనీవాసులు కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చంద్రిక, జహంగిర్, కృష్ణ, ప్రవీణ్‌రెడ్డి, సోమేశ్వర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి ,హరిబాబు, సుధీర్, క్రాంతి, అంజన్ పాల్గొన్నారు.

సీఐటీయూను గెలిపించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : కార్మికుల సమస్యలను పరిష్కరించి, కార్మికులకు మంచి వేతన ఒప్పందం చేసే సత్తా కేవలం సీఐటీయూకే సాధ్యమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. సోమవారం సాయంత్రం బండ్లగూడలోని పెన్నార్ పరిశ్రమ యూనియన్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్నార్ పరిశ్రమలో ఈనెల 6వతేదీన జరిగే యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గెలిపించుకుంటే కార్మికులకు వేతన ఒప్పందాన్ని సాధించి పెడతామని తెలిపారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్, నాయకులు మల్లేశం, కే.రాజయ్య, కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, జయమ్మ, వివిధ పరిశ్రమల కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.